క్లుప్తంగా

వెంకన్న సన్నిధి.. భక్తుల పెన్నిధి



విశేష అలంకరణలో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వైశాఖ మాసంలోని శనివారం కావడంతో వేలాదిగా భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చారు. భక్తుల క్యూ లైన్ జాతీయ రహదారి పైకి వచ్చింది. స్వామివారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. సుమారు 15 మంది భక్తులకు అన్నసమారాధన చేసినట్టు ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. సుమారు 20 వేల మంది స్వామివారి దర్శనం చేసుకున్నారని ఆయన చెప్పారు.

కృష్ణబాబుకు ఎమ్మెల్యే తలారి నివాళి



దొమ్మేరులో కృష్ణబాబు చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు మృతి పార్టీకి తీరని లోటని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన కృష్ణబాబు ఈ ప్రాంతాభివృద్ధి ఎంతో కృషి చేశారన్నారు. శనివారం దొమ్మేరులో కృష్ణబాబు స్వగృహానికి వెళ్లిన తలారి వెంకట్రావు కృష్ణబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. కృష్ణబాబు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్ర, పార్టీ చాగల్లు మండలశాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా ఏడుకొండలు, నాయకులు గారపాటి శ్రీనివాస రావు, గెడా శ్యాం సుందర్, ముళ్లపూడి భాస్కరరావు తదితరులు కృష్ణబాబు అల్లుడు రాజీవ్‌కృష్ణ, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మరికొందరు ప్రముఖులు ..

మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశ రావు, జనసేన పార్టీ తాడేపల్లిగూడెం అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, ఆ పార్టీ గోపాలపురం ఇన్‌చార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చెరుకూరి వీర్రాజు, ఠాగూర్ కెమికల్స్ ఎండీ రమేష్‌రాజు, కరిబండి విద్యాసంస్థల అధినేత కరిబండి గన్నిరాజు తదితరులు ఆంధ్రా షుగర్స్ జేఎండీ, కృష్ణబాబు సోదరుడు అచ్చిబాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉపాధి కూలీలతో రోడ్డు నిర్మాణం



ఊర చెరువు వద్ద నుంచి బైపాస్‌కు రోడ్డు వేస్తున్న ఉపాధి కూలీలు

గోపాలపురం: ఉపాధి హామీ పథకంలో ప్రజల రహదారి సమస్యలు తీరుతున్నాయి. గోపాలపురంలోని ఊర చెరువు వద్ద నుంచి గ్రామంలోని బైపాస్ రోడ్డు వరకూ శనివారం ఉపాధి కూలీలు తాత్కాలిక రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ఎంతో కాలంగా రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య ఎంపీడీఓ కె.రమేష్‌బాబు దృష్టికి రావడంతో ఆయన చొరవ తీసుకుని ఊర చెరువు నుంచి బైపాస్ రోడ్డు వరకూ ఉపాధి హామీ పథకం కింద రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో రజకులు ఆనందం వ్యక్తం చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకూ మాత్రమే ఉపాధి కూలీలు పని చేస్తున్నారని ఎంపీడీఓ తెలిపారు. వారికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

మళ్లీ జగన్ సీఎం కావాలంటూ పూజలు

తాళ్లపూడి: సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ విజయం సాధించాలని, రాజమహేంద్రం లోక్‌సభ, ఈ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవాలని ప్రార్థిస్తూ కోనసీమ జిల్లాలోని వాడపల్లి వెంకటేశ్వర స్వామి గుడిలో ఆ పార్టీ నాయకులు ఏడు శనివారాలు పూజలు నిర్వహిస్తున్నారు. ఏడు వారాల్లో భాగంగా శనివారం కూడా వాడపల్లి వెంకన్న గుడిలో పెద్దేవం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం వారు నేరుగా రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను రాజమహేంద్రవరంలో కలిసి శాలువాతో సత్కరించి , ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ద్వారకా తిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు చిట్టూరి అన్నవరం, ఆ పార్టీ పెద్దేవం గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏరువాకకు వేళాయె..

- వాతావరణం అనుకూలం
- కొవ్వూరు డివిజన్‌లో 42,769 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు
- రాయితీపై విత్తనాల సరఫరా
- 10,328 మెట్రిక్ టన్నుల ఎరువులు
- ఆకుమడులకు రైతుల సన్నాహాలు



దేవరపల్లి మండలం యర్నగూడెంలో బోరు కింద వేసిన వరి ఆకుమడి

దేవరపల్లి: తొలకరి సాగుకు అన్నదాతలు సన్నద్ధం అవుతున్నారు. వాతావరణం అనుకూలించి, 10 రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో వ్యవసాయ శాఖ కొవ్వూరు సబ్ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో రైతులు పనిముట్లు చేతబట్టి పొలం బాట పట్టారు. బోర్ల కింద ఆకుమడులు వేయడానికి దుక్కులు దున్ని మడులు తయారు చేస్తున్నారు. ముందస్తు సాగుకు సిద్ధమవుతున్నారు. ముందస్తు సాగుపై మూడేళ్లుగా ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పిస్తోంది. అంతేగాకుండా సొసైటీలు, రైతుభరోసా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల ద్వారా సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తోంది. దీంతో రైతులు చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను కాపాడుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధిస్తున్నారు. 2024 ఖరీఫ్ సాగుకు అవసరమైన ముందస్తు ప్రణాళికతో వ్యవసాయ శాఖ రైతులను ప్రోత్సహిస్తోంది.

42,769 హెక్టార్లలో ఖరీఫ్ లక్ష్యం

కొవ్వూరు డివిజన్ పరిధిలోని గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లోని తొమ్మిది మండలాల్లో 42,769 హెక్టార్ల విస్తీర్ణంలో ప్రస్తుత ఖరీఫ్ పంటల సాగు లక్ష్యంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో 39,620 హెక్టార్ల వరి సాగు విస్తీర్ణం ఉండగా, మొక్కజొన్న 107 హెక్టార్లు, మినుము 1,236 హెక్టార్లు, చెరకు 1,249 హెక్టార్లు, ప్రత్తి 184 హెక్టార్లు, వేరుశనగ 258 హెక్టార్లు, ఇతర పంటలు 115 హెక్టార్లలో సాగవుతాయని అధికారులు తెలిపారు.



యర్నగూడెం సొసైటీ వద్ద పంపిణీకి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

పంపిణీకి వరి విత్తనాలు సిద్ధం

ఖరీఫ్ సాగుకు అవసరమైన వరి విత్తనాలకు వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం సిద్ధం చేసింది. తొలకరికి ముందే విత్తనాలను రైతులకు సరఫరా చేస్తున్నారు. డివిజన్‌కు 21,384 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా ప్రస్తుతం 4,800 క్వింటాళ్ల విత్తనాలను సొసైటీలు, ఆర్‌బీకేలు, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచారు. మిగిలిన విత్తనాలను రైతు నుంచి రైతుకు సరఫరా చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో ఎక్కువగా పీఎల్‌ఏ-1100, సంపద, స్వర్ణ, ఎంటీయూ-1318, ఎంటీయూ-1064 రకాల విత్తనాలను సాగు చేస్తున్నారు.



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో ట్రాక్టర్‌తో వరి ఆకుమడి తయారీ

ఎరువుల సరఫరా

ప్రస్తుత సార్వా సీజన్‌కు కొవ్వూరు డివిజన్‌కు 24,312 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. అందులో ఇప్పటికే 10,328 మెట్రిక్ టన్నుల ఎరువులను సొసైటీలు, ఆర్‌బీకేలు, ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో ఉంచినట్టు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

భూ సారాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై రైతులకు పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను పంపిణీ చేస్తోంది. జీలుగ 220 క్వింటాళ్లు, పిల్లి పెసర 15 క్వింటాళ్లు సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. జీలుగ అసలు ధర కిలో రూ.88 కాగా, రాయితీపై రూ.44కు, పిల్లిపెసర అసలు ధర కిలో రూ.134 కాగా, రాయితీపై రూ.67కు రైతులకు పంపిణీ చేస్తున్నారు.

సాగుకు సర్వం సిద్ధం



ఖరీఫ్ సాగుకు కొవ్వూరు సబ్ డివిజన్‌లో సర్వం సిద్ధంగా ఉన్నాం. 2024 సార్వా సీజన్‌లో డివిజన్‌లో 24,769 హెక్టార్లలో పంటల సాగును లక్ష్యంగా నిర్దేశించాం. ఇందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాం. ఆకుమడులు వేయడానికి రైతులు సన్నద్ధం అవుతున్నారు. అధీకృత లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి. తప్పని సరిగా రశీదు తీసుకోవాలి. విత్తన సంచి, ట్యాగ్‌ను పంట కాలం చివరి వరకూ భద్రపరచాలి. పంట వేయడానికి ముందే విత్తన మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి. మొక్కజొన్న, మిరప, విత్తనాల కొనుగోలులో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. సమస్య వస్తే మండల వ్యవసాయ శాఖ అధికారి దృష్టికి తీసుకువెళితే చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

– చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

ఖరీఫ్‌లో 28 వేల ఎకరాల్లో సాగు



కమల్‌రాజ్, ఏఓ, నల్లజర్ల మండలం

నల్లజర్ల: మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. 27,838 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ పంటలు సాగవుతాయని ఆ శాఖ అధికారులు లెక్క వేశారు. ఇందులో వరి 10,885, పెసర 14.82, మినుములు 624.91, చెరకు 170, వేరుశనగ 340.86 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతుందని అంచనా వేశారు. మరో 15,000 ఎకరాలలో ఉద్యాన పంటలు సాగవుతాయని మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ తెలిపారు. వరి సాగు చేసే రైతుల కోసం మండలానికి 2,000 క్వింటాళ్ల వరి విత్తనం అవసరమన్నారు. ఐదు సొసైటీలు, 10 ప్రైవేట్ షాపులు, రైతుల ద్వారా వరి విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ఈ సీజన్‌కు 5,300 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అవసరం కాగా, ఇప్పటికే 3,100 టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. వరిలో సంపత్ స్వర్ణ, సంపద గోల్డ్, పీఎల్‌ఏ-1100, బీపీటీ-5204, ఎంటీయూ-7029 రకాల వరి వంగడాలు మండలంలో సాగుకు అనుకూలమన్నారు.

3న కొవ్వూరు మండల పరిషత్ సమావేశం

కొవ్వూరు: మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని జూన్ మూడో తేదీ ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్టు కొవ్వూరు ఎంపీడీవో కె.సుశీల శనివారం తెలిపారు. 1994- పంచాయతీరాజ్ చట్టంలోని ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున సభ్యులంతా ఈ సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..

నల్లజర్ల: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్య పుస్తకాలు మండల విద్యావసరుల కేంద్రానికి చేరాయి. తొలి విడతలో ఒకటి నుంచి ఏడు తరగతుల వారికి 7,500, ఎనిమిది, పది తరగతుల విద్యార్థులకు 1,100, తొమ్మిదో తరగతి వారికి 970 పాఠ్య పుస్తకాలు వచ్చినట్టు ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు. తొలి విడతలోనే విద్యార్థులకు బెల్ట్‌లు కూడా వచ్చాయన్నారు. వాటన్నింటినీ జూన్ మొదటి వారంలో ఆయా పాఠశాలలకు అందజేస్తామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో అయితే విద్యా సంవత్సరం ముగిసే దశలోనూ విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందేవి కావు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టారు. నాడు-నేడు పథకం కింద పాఠశాలల్లో వసతులు మెరుగు పరిచారు. విద్యాకానుక పేరుతో విద్యార్థులకు తొమ్మిది రకాల వస్తువులు (బూట్లు, సాక్స్ వంటివి) ఇవ్వడమే గాకుండా, జగనన్న గోరుముద్ద వంటి పథకం అమలుతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గుచూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.



నల్లజర్ల విద్యావసరుల కేంద్రానికి చేరుకున్న పాఠ్య పుస్తకాలు

పాఠశాలలు పునఃప్రారంభం నాటికే పూర్తిస్థాయిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా నాణ్యతతో కూడిన విద్యా కానుకలను విజయవంతంగా విద్యార్థుల చేతికి అందజేసింది.అదే వరవడితో ఈ ఏడాది కూడా పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక కిట్లు అందించాలన్న లక్ష్యంతో విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

దేవదాయ శాఖకు కల్యాణ మండపం అప్పగింత

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆ గ్రామస్తులు నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎట్టకేలకు దేవదాయ, ధర్మాదాయ శాఖకు స్వాధీనం చేశారు. ఆ గ్రామస్తులు చందాలతో పదేళ్ల క్రితం ఈ కల్యాణ మండపాన్ని నిర్మించారు. కల్యాణ మండపం నిర్వహణ విషయంలో 2018లో అప్పటి ఆలయ పాలక వర్గానికి, గ్రామస్తులకు మధ్య వివాదం తలెత్తింది. ఈ మండపాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖకు అప్పగించాలని ఆలయ పాలకవర్గం ప్రతిపాదించగా, గ్రామస్తులు అందుకు అభ్యంతరం తెలిపారు. అంతేగాకుండా గ్రామస్తుల తరపున ఓసూరి బాలయోగి అనే వ్యక్తి హైకోర్టులో పిల్ వేసి మండపం దేవదాయశాఖ ఆధీనంలోకి వెళ్లకుండా స్టే తెచ్చారు. నాటి నుంచి నేటి వరకూ ఈ కల్యాణ మండపంలో గ్రామస్తుల సమక్షంలో ప్రతి శనివారం భక్తులకు ఉచిత భోజనాలు అందిస్తున్నారు. కాగా ఇటీవల దేవదాయ శాఖ అధికారులు పలు దఫాలుగా గ్రామస్తులతో చర్చలు జరిపి మండపాన్ని ఆ శాఖకు స్వాధీనం చేసేలా వారిని ఒప్పించారు. దాంతో హైకోర్టులో వేసిన పిటిషన్‌ను ఓసూరి బాలయోగి స్వచ్ఛందంగా ఉపసంహరించుకున్నారు. ఈ క్రమంలో దీంతో దేవదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.విజయ్‌రాజ్ శనివారం అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చి గ్రామస్తుల సమక్షంలో ఈ కల్యాణ మండపాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఇకపై కూడా ప్రతి శనివారం ఉచిత అన్నదానాన్ని ఇదే కల్యాణ మండపంలో నిర్వహించేందుకు విజయరాజ్ అంగీకరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.సోమరాజు, ఇన్‌స్పెక్టర్ జి.సత్యవరప్రసాద్, ఈఓలు కేఎస్‌వీడీ ప్రసాద్, చైతన్య, ఎ. సత్యవర్ధనరావు, శ్రీనివాస రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అన్నవరప్పాడులో కల్యాణ మండపాన్ని దేవదాయ శాఖకు స్వాధీనం చేస్తున్న గ్రామస్తులు

కాలనీల్లోని పలు గృహాల్లో పోలీసు తనిఖీలు



గోపాలపురం బీసీ కాలనీలో యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న కొవ్వూరు డీఎస్పీ రామారావు

గోపాలపురం: కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు సారథ్యంలో పోలీసులు శనివారం గోపాలపురం బీసీ కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో అనుమానిత గృహాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామారావు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్కడి యువతకు డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ తనిఖీల్లో దేవరపల్లి సీఐ కె. బాలసురేష్, గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

10 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు



సారా తయారీ సామగ్రి, నిందితుడితో పోలీసులు

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట శివార్లలోని తాడిపూడి కాలువ గట్టు వద్ద నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. ఇక్కడ గుర్తించిన 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ గ్రామానికి చెందిన గుబ్బల శ్రీనును అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్ట ఎస్సై చెప్పారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: అనుమానంతో భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ శనివారం తెలిపారు. మండలంలోని కలవచర్ల గ్రామానికి చెందిన పసల జ్యోతికి బాలకృష్ణతో 2008లో వివాహమైంది. కొంతకాలంగా భర్త బాలకృష్ణ శారీరకంగా, మానసికంగా తనను వేధిస్తున్నాడంటూ జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రమేష్ చెప్పారు.

పారదర్శకంగా విధులు నిర్వహించాలి

- నిడదవోలు ఆర్వో వెంకట రమణ నాయక్
- ఓట్ల లెక్కింపు సిబ్బందికి అవగాహన

నిడదవోలు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు విధులను పారదర్శకంగా, అప్రమత్తంగా నిర్వహించాలని నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్. వెంకటరమణ నాయక్ ఆదేశించారు. ఓట్ల లెక్కింపు విధులపై శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో లెక్కింపు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆర్వో మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు రాజమహేంద్రవరం సమీపంలోని నన్నయ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. తమకు కేటాయించిన విధులను సజావుగా నిర్వహించేందుకు అధికారులు, ఇబ్బంది ముందుగానే సంసిద్ధం కావాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి, ఏజెంట్లకు గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. కౌంటింగ్ సమయంలో అవసరమయ్యే అన్ని రకాల ఫారాలు, రబ్బరు స్టాంపులను ముందుగానే సిద్ధం చేస్తామని చెప్పారు. ఫారం-17 సి జిరాక్స్ కాపీని ఏజెంట్లకు అందజేసి అకనాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలని సూచించారు. ఏదైనా సందేహం ఉంటే ముందుగానే నివృత్తి చేసుకోవాలని వెంకటరమణ నాయక్ సూచించారు. లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు 14, అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపునకు మరో 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తారని చెప్పారు. ప్రతి టేబుల్ వద్దా ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని వివరించారు. మొత్తం 120 మంది సిబ్బంది కౌంటింగ్ విధుల్లో పాల్గొంటారని చెప్పారు.



కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన సమావేశానికి హాజరైన సిబ్బంది

పోస్టల్ బ్యాలెట్ల తరలింపు

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఉన్న పోస్టల్ బ్యాలెట్‌లతో కూడిన రెండు ట్రంక్ డబ్బాలను శనివారం పోలీసు భద్రతతో రాజమహేంద్రవరం సమీపంలోని నన్నయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు తరలించారు. రెండు ట్రంకు డబ్బాల్లో 1,920 పోస్టల్ బ్యాలెట్ కవర్లు ఉన్నాయని ఆర్వో ఆర్. వెంకటరమణ నాయక్ తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో కొవ్వూరు డీఎస్పీ సీహెచ్ రామారావు, ఆర్వో ఆర్.వెంకటరమణనాయక్, తహసీల్దారు నాగభూషణం, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి ఈ పోస్టల్ బ్యాలెట్ తరలింపులో పాల్గొన్నారు.

అట్టహాసంగా అంకాలమ్మ జాతర

తాళ్లపూడి: మండలంలోని తుపాకులగూడెం గ్రామదేవత అంకాలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గ్రామసేవ నిర్వహించారు. ఉమావరుణ్ ట్రూప్ ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, కేరళ వాయిద్యాలు, కాళికా నృత్యాలు, శక్తివేశాలు, తీన్మార్ వాయిద్యాలతో గ్రామ ప్రధాన వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు. 12 ఏళ్లకు ఒకసారి జరిగే అమ్మవారి జాతరకు గ్రామ ఆడ పడుచులు, బంధువులు రావడంతో గ్రామం అంతటా సందడి నెలకొంది. ఆదివారం అంకాలమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారు. పిల్లి రామకృష్ణ, బాలం వెంకటేశులు, సీలబోయిన సత్యనారాయణ, సీలబోయిన సుబ్బారావు తదితర గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జాతర కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.



తుపాకులగూడెం జాతరలో కేరళ వాయిద్యాల ప్రదర్శన

ఐ.పంగిడిలో వెలగలమ్మ జాతర

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామంలోని వెలగలమ్మ వారి జాతరను వైభవంగా నిర్వహి స్తున్నారు.శనివారం సాయంత్రం గ్రామ పొలిమేరలో బలిచేట ఊరేగించారు. గ్రామ యువత కోలాహలంగా ఈ ఊరేగింపులో పాల్గొంది. అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం మొక్కులు చెల్లించుకుని నైవేద్యాలు సమర్పిస్తారు. ఇప్పటికే బంధు మిత్రుల రాకతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. రెండు రోజుల నుంచి కొనసాగుతున్న జాతర వేడుకలు ఆదివారం నాటి నైవేద్యాలతో ముగుస్తాయి.

అమ్మవారి పూరి పాక వద్ద పూజలు

చాగల్లు: మార్కొండపాడు గ్రామ దేవత మహాలక్ష్మమ్మ వారి పురిపాక వద్ద నడివీధిలో శనివారం కుంకుమ పూజలు చేశారు. మహిళలు భజన చేశారు.

ముత్యాలమ్మ జాతర ప్రారంభం

దేవరపల్లి: మండలంలోని బందపురం గ్రామ దేవత ముత్యాలమ్మ వారి జాతర మహోత్సవాలకు ఆ గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. అమ్మవారిని గ్రామ శివార్లలోని ఆలయం నుంచి ఊరేగింపుగా శనివారం గ్రామ నడివీధికి తీసుకు వచ్చి ప్రత్యేకంగా వేసిన తాటాకు పూరి గుడిసెలో ఉంచారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహిస్తారు. జూన్ 15 వరకూ అమ్మవారిని నడివీధిలోని పూరిగుడిసెలో ఉంచి పూజలు, గ్రామంలో ఊరేగింపు, ఇంటింట పొన్పుల కార్యక్రమం నిర్వహిస్తారు. 15న అమ్మవారి జాతర, బలిచేట, 16న నైవేద్యాల సమర్పణ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.





అమ్మవారిని ఆలయం నుంచి గ్రామ నడి వీధికి తీసుకు వస్తున్న గ్రామస్తులు (అంతర చిత్రం) బందపురం గ్రామదేవత ముత్యాలమ్మ వారు

87 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గాంధీనగర్‌లోని ఆయుర్వేద ఆసుపత్రిలో 87 మందికి ఉచితంగా సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, డాక్టర్ కొల్లిపర శ్రీవిద్య, ఉజ్జిన నెహ్రూ, పొన్నా సుబ్రహ్మణ్యం, గాజుల రంగారావు, గొన్నాబత్తుల రామారావు, గుంటిపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

58 మందికి ఒక్కరే హాజరు

నల్లజర్ల: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు శనివారం నిర్వహించిన హిందీ పరీక్షకు మండలంలోని మూడు కేంద్రాల్లో 123 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, కేవలం ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. ఈ విషయాన్ని ఎంఈఓ వై.సత్యనారాయణ ధ్రువీకరించారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రానికి 58 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే హాజరయ్యారు. ఇక్కడ మూడు రూమ్స్ ఏర్పాటు చేసి ముగ్గురు ఇన్విజిలేటర్లు, ఒక చీఫ్, ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, అత్యవసర మెడికల్ బృందం, మహిళా పోలీసును నియమించారు. ఒక విద్యార్థి కోసం ఏడుగురు అధికారులు హాజరయ్యారు. అలాగే నల్లజర్లలోని శశి స్కూల్ పరీక్ష కేంద్రంలో63 మందికి ఇద్దరు విద్యార్థులు, సెయింట్ క్లారెట్స్ కేంద్రంలో 52 మందికి ఇద్దరు విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు.

వేతనం రోజుకు రూ.17.50 మాత్రమే

- కంగుతిన్న ఎన్నికల సిబ్బంది
- ఎన్నికల సంఘం తీరుపై నిరసన
- వేతన సొమ్ము తీసుకోవడానికి నిరాకరణ

నల్లజర్ల: ఎన్నికల విధుల్లో పాల్గొన్న తమకు రోజుకు కేవలం రూ.17.50 చొప్పున మాత్రమే వేతనం చెల్లించడంతో సిబ్బంది విస్మయం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నగదు, బంగారం, మద్యం రవాణాను అడ్డుకునేందుకు స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు (ఎస్ఎస్‌టీ) ఫ్లయింగ్ సర్వేలెన్స్ (ఎఫ్ఎస్‌టీ) బృందాలను ఏర్పాటు చేశారు. గోపాలపురం నియోజకవర్గంలో ఒక్కో మండలానికి రెండేసి బృందాలు, దేవరపల్లి మండలానికి మాత్రం మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో 8 మంది గ్రేడ్-1, గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. రోజుకు 12 గంటల చొప్పున దాదాపు 59 రోజుల పాటు రాత్రింబవళ్లు షిఫ్టుల వారీగా వీరంతా విధులు నిర్వహించారు. వేతనం కోసం వారంతా శనివారం గోపాలపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆఫీసుకు వెళ్లగా ఒక్కో ఉద్యోగికి 59 రోజులకు రూ.1000 చొప్పున ఇవ్వబోయారు. 'ఇదేనా మేం పడిన కష్టానికి మీరిచ్చే వేతనం' అంటూ వారంతా ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ఆదేశాల్లో ఈ రెండు బృందాలకు ఇంత సొమ్మే చెల్లించాలని ఉందంటూ దీనిపై అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, గోపాలపురం తహసీల్దార్ వనజాక్షి తమకు జవాబిచ్చారని సిబ్బంది వాపోతున్నారు. ఈ డబ్బు తీసుకోవడానికి సిబ్బంది నిరాకరించారు. సోమవారం కలెక్టరును కలిసి తమ ఆవేదనను చెబుతామని సిబ్బంది తెలిపారు.